అన్ని రుగ్మతలకు యోగా దివ్యౌషధం

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు


విద్యార్థులకు యోగాసనాలు నేర్పిస్తున్న మాస్టర్ సురేందర్

బోడుప్పల్: అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. యోగా గురువు సురేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా టెక్నికల్ డైరెక్టర్ ఆపరేషన్స్ కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యవంతంగా ఉండేందుకు దైనందిన జీవితంలో ఒక బాగంగా యోగా చేయాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జేజీఆర్ ఉన్నత పాఠశాలలో...

బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు యోగాసనలు వేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతగా ఉండేందుకు ప్రతి రోజు యోగా చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుషాయిగూడలో...

కుషాయిగూడ: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ పార్కులు, అసోసియేషన్ కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం నుంచే యోగా వేడుకలు ప్రారంభమయ్యాయి. చర్లపల్లి జైలులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా డేలో జైలు పర్యవేక్షణాధికారి సంతోష్‌కుమార్ రాయ్, సిబ్బందితో పాటుగా రెండు వేల మంది ఖైదీలు యోగా ఆసనాలు వేశారు. కుషాయిగూడలోని మల్కాజిగిరి జిల్లా కోర్టులో జరిగిన వేడుకల్లో జడ్జిలు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో...

రామంతాపూర్: బాలభారతి పాఠశాలలో శుక్రవారం హృదయ భారతి సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ మంగళ మక్కపాటి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంఘం అధ్యక్షుడు సత్తిరాజు, కపర్థీశ్వర్‌రావు, యోగా గురువు రామనాథం, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో....

మల్కాజిగిరి: అంతర్జాతీయ యోగా డే సందర్భంగా మల్కాజిగిరి బాలుర పాఠశాల ఆవరణంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగాసనాలు చేయడం వలన కలిగే ఉపయోగాలను యోగ శిక్షకురాలు విద్యార్థులకు తెలియజేశారు.

అల్వాల్‌లో...

అల్వాల్/గౌతంనగర్: యోగాడేను పురస్కరించుకొని అల్వాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

గౌతంనగర్‌లో....

సఫీల్‌గూడ ఏటసి గ్రౌండ్‌లో గౌతంనగర్, మల్కాజిగిరికి చెందిన పలువురు యోగా డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభు గుప్త, నాగరాజు, శ్రీనివాస్, రవి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, ధర్మారావు,కిరణ్, ప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలిలో...

మౌలాలి: మౌలాలి డివిజన్ ఆర్కెహెచ్ పార్కులో మహిళా మోర్చా అధ్యక్షురాలు రాధాబాయ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో...

మల్లాపూర్: మల్లాపూర్, నాచారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో యోగా డే వేడుకులు ఘనంగా నిర్వహించారు. యోగా ప్రాముఖ్యతనే పలువురు వక్తలు తెలియజేశారు. సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాలని యోగా సాధన వల్ల మానసిన ప్రశాంతత కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో...

ఉప్పల్ : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ పాఠశాల యోగా శిక్షకులు కరుణాకర్ రావు, ఆరోగ్య సలహాదారు డా. పి మురళి కృష్ణలు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. అనంతరం కళాశాల ప్రధానోపాధ్యాయులు బ్రదర్ జోసఫ్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ప్రదాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. శారీరక , మానసిక వికాసానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉప్పల్ మినీ శిల్పారామంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి


కుషాయిగూడలోని జిల్లా కోర్టులో ఆవరణలో..


యోగా వేడుకల్లో పాల్గొన్న గంగరాజు


చర్లపల్లి జైలులో జైలులో అధికారులు, ఖైదీలు..


రామంతాపూర్ బాల భారతి పాఠశాలలో...

కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓగా అంజయ్య



కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా జి. అంజయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహించిన ఇన్‌స్పెక్టర్ వీరస్వామి ఇరవై రోజుల క్రితం ఏసీబీకి చిక్కి జైలు పాలైన విషయం విధితమే. అనంతరం డిఐ రాజునాయక్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా సైబర్ క్రైంలో విధులు నిర్వహిస్తున్న జి. అంజయ్యను కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ రాచకొండ సీపీ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతుగా కృషి చేస్తానన్నారు.

హనుమాన్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్‌సునీతా యాదవ్.

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్ కాలనీలో ఎస్ఎన్ డీపీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాక్స్ డ్రైనేజీ పనుల కోసం రూ. 1.కోటి 75 లక్షలు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులను కార్పొ రేటర్ ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ మధురిమ, శివ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి...


మేయర్‌ను కలిసిన కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ అభివృద్ధికి సహకరించాలని మేయర్ గద్వాల విజయలక్ష్మికి కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని ముంపు సమస్య తీర్చడానికి బాక్స్ డ్రైన్ల నిర్మాణానికి తగిన నిధులు మంజూరు చేయాలని కోరామని ఆయన తెలిపారు.

మీ వాహనాలను తీసుకెళ్లండి

– ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఉప్పల్ : ఉప్పల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కారణాల చేత పోలీసుల వద్ద ఉండి పోయిన ద్విచక్ర వాహనాలను సదరు యజమానులు వచ్చి తీసుకెళ్లాలని ఉప్పల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. గత కొన్నాళ్లుగా స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను యజమానులకు అందజేస్తున్నట్లు తెలిపారు. 37కు పైగా వాహనాలు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ 8712662466ను సంప్రదించి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేస్తున్న వజ్రేష్ యాదవ్

మేడిపల్లి. ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన గోరింకల శ్రీనివాస్ కుమార్తె ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. దీంతో శుక్రవారం దీనికి సంబంధించిన ఎల్‌ఓసి రూ. 1.70 లక్షల చెక్కును మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, నాయకులు దేశగోని శ్రీనివాస్‌గౌడ్, పాశంరాజుయాదవ్, దుబ్బాక జైహింద్ గౌడ్, పాశం సత్యం తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ.. యువకుడి మృతి


మృతి చెందిన శ్రవన్‌కుమార్

మేడిపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీనివాస్‌నగర్ కాలనీ బోడుప్పల్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ (23)తన ద్విచక్ర వాహనంపై తన పని నిమిత్తం ఉప్పల్ నుంచి మేడిపల్లి వైపు వస్తుండగా, అదే సమయంలో రాంగ్ రూట్‌లో అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న శ్రవన్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో శ్రవణ్‌కుమార్ తన బైక్‌పై నుంచి ఎగిరి కిందపడడంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధితుల ఫిర్యాదు మేరము కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మేడిపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పరశరాములు (ఫైల్ ఫొటో)

మేడిపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.... సిద్దిపేటకు చెందిన బొమ్మ పరశురాములు (35) నగరంలోని చెంగిచెర్ల ఇందిరానగర్ కాలనీలో కుటుంబసభ్యులతో ఉంటూ స్థానికంగా ఉన్న మేకల మండిలో పని చేస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం తన ద్విచక్ర వాహనంపై మేడిపల్లి వైపు వెళుతుండగా చెంగిచెర్లలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న డీసీఎం వాహనం స్కూటీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన పరుశరాములు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి కృషి

అమ్మవారి ద్వాదశ వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్: ఆర్టీసీ కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన అమ్మవారి ద్వాదశ వార్షికోత్సవ వేడుకలకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆలయ చైర్మన్ పసుల ప్రభాకర్‌రెడ్డితో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలోని అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, అదే విధంగా వచ్చే బోనాల పండుగకు అమ్మవార్ల ఆలయాల అభివృద్ధికి ఇచ్చే నిధులను పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, ఆలయ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణరెడ్డి, కోశాధికారి ఎ.పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎత్తేశారు...

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: ఇష్టారాజ్యంగా ఇంటింటికీ చెత్త సేకరణ అంటు ×ఎక్కడ చూసిన చెత్త తిప్పలే× శీర్షికతో గురువారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి శానిటేషన్ అధికారులు స్పందించారు. సౌత్ కమలానగర్ వీధుల్లో పేరుకుపోయిన చెత్తను ఎత్తేసి బ్లీచింగ్ చేశారు. చెత్త సేకరణలో నిర్లక్ష్యం చేసిన ఆటో రిక్షా కార్మికులకు జరిమానా విధించనున్నట్లు ఏఎంహెచ్ఓ డాక్టర్ ఎన్. వెంకటరమణ తెలిపారు.. అలాగే కిందిస్థాయిలో విధులు నిర్వహించే సిబ్బందిని కూడా మందిలించినట్లు పేర్కొన్నారు. పని తీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిపారు.


చెత్తను ఎత్తేసి శుభ్రం చేసిన ప్రదేశాలు

పోస్టల్ మేళాకు మంచి స్పందన


ఇందిరాభవన్‌లో పోస్టల్ మేళా నిర్వహిస్తున్న నిర్వాహకులు

మల్కాజిగిరి: మల్కాజిగిరి పోస్టాఫీస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాభవన్‌లో నిర్వహించిన మేళాకు మంచి స్పందన వచ్చిందని ఎఎస్‌పి వెంకన్న, పోస్ట్ మాస్టర్ శ్యామల తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు తక్కువ మొత్తంతో ఎక్కువ లాభం పొందే పథకాలతో పాటు, ఇన్సూరెన్స్ పాలసీలు ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 21 సాధారణ అకౌంట్లు, యాక్సిడెంట్ పాలసీలు 15పీఎల్‌ఐ 6, ఎస్ఎస్‌ఎ 6 మంది చేసుకున్నారని వివిధ ప్రాంతాల్లో మేళాను ప్రతివారం నిర్వహిస్తామని వారు తెలిపారు.

ఈటల రాజేందర్‌కు సత్కారం

అల్వాల్: అల్వాల్‌లోని రైతు సహకార సంఘం చైర్మన్ తోట గోపాల్‌రెడ్డిని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ శుక్రవారం ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల గోపాల్‌రెడ్డి అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న ఈటల రాజేందర్ ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరితంగా కోలుకుని కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు సేవలందించాలన్నారు. అనంతరం మల్కాజిగిరి పార్లమెంట్‌లో అత్యధిక మెజార్టీతో గెలిచినందుకు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు.


ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న తోట గోపాల్‌రెడ్డి తదితరులు

పలకలు, బొమ్మల అందజేత


అంగన్‌వాడీ స్కూల్‌కి పలకలు, బొమ్మలను అందజేస్తున్న గీతా

మల్లాపూర్: మల్లాపూర్ ఎస్వీనగర్‌లోని అంగన్‌వాడీ పాఠశాలకు బీజేపీ నాయకురాలు గీతా విద్యార్థులకు పలకాలు, బొమ్మలు, చాపను, పెన్సిల్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగరాణి, జ్ఞానేశ్వరి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్ జ్యోతి స్కూల్‌లో ఆధార్ నమోదు సేవా కేంద్రం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు అరవింద్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఆధార్ నమోదు కేంద్రంలో పేర్ల దిద్దుబాటు, పుట్టిన తేదీలు మార్చుకోవడం, ఫోన్ నెంబర్‌లు సరిచేసుకోవడం, బయోమెట్రిక్, అడ్రస్‌లు మార్చుకోవడంతోపాటు నూతన ఆధార్ కార్డులు నమోదు చేసుకోవచ్చునన్నారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

నీట్ అవకతవకలపై నిరసన

కుషాయిగూడ: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై నిరసనలు చేపట్టారు. శుక్రవారం సిపిఎం, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించి ఈసీఐఎల్ చౌరస్తాలో నిరసన తెలిపారు. సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బాధ్యత వహించాలన్నారు. సంబంధిత మంత్రి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ఆందోళనలు ఆపేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి. శ్రీనివాసులు, సిహెచ్ దేవిరెడ్డి, ప్రసాద్, ఎంఎస్ రావు, బివి సత్యనారాయణ, శివనారాయణ, సోమ యాచారి, ఉదయభాస్కర్ ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, అరుణ్, మౌనిక, సరిత,వన్య, నందిని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీ, నాగలక్ష్మీనగర్ మల్లాపూర్ ఐడీఏ ప్రధాన రోడ్డులో రూ.42 లక్షల వ్యయంతో చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ వంటి మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని వినతి


జలమండలి జీఎంకి వినతి పత్రం అందజేస్తున్న శాంతి సాయిజెన్‌శేఖర్,

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని నాచారం ఓల్డ్ విలేజ్, ఇందిరానగర్‌లో భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కోరుతూ శుక్రవారం జలమండలి జీఎంకు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాచారం ఓల్డ్ విలేజ్‌లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా ఇందిరానగర్ ఫస్ట్ లెఫ్ట్, మసీద్ గల్లీలో మంజూరైనా డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ బీఆర్ఎస్ నేత సాయిజెన్‌శేఖర్, విఠల్ యాదవ్, భూపాల్ రెడ్డి, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

గౌతంనగర్‌లో ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు

గౌతంనగర్: గౌతంనగర్ రైల్వే గేటు సమీపంలో ఆర్‌యూబి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వే ప్రాజెక్టు, జీహెచ్‌ఎంసి ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌తోపాటు కాలనీలవాసులతో కలిసి ఆయన గౌతంనగర్ రైల్వే గేటు సమీపంలో ఆర్‌యూబి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గౌతంనగర్ రైల్వే గేటు వద్ద నిత్యం పలుమార్లు రైల్వే గేటు పడడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుడడంతో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్‌యూబి నిర్మాణం కోసం మంజూరైన పనులను త్వరలో చేపట్టేందుకు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలను పరిశీలించి ప్రజలకు అనుకూలమైన రాకపోకల మార్గం నుంచి ఆర్‌యూబి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, రైల్వే అధికారులు ఏ.డి.ఎం. రవి ప్రకాష్, ప్రాజెక్టు అధికారులు సుదర్శన్, జీహెఎంసి ఇంజనీర్‌లు లౌక్య, ఏఈ. దివ్య జోతి, బిఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ సార్ అడుగుజాడల్లో నడవాలి

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు


జయశంర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

అల్వాల్/గౌతంనగర్: తెలంగాణ సిద్ధాంత కర్త, తెలంగాణ రాష్ట్ర సాధణ కోసం తన జీవితమంతా తపించిన మహా మనిషి కొత్తపల్లి జయశంకర్ సార్ అని ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అల్వాల్ సర్కిల్ తెలంగాణ తల్లి సెంటర్‌లోని జయశంకర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ ఉద్యమ కార్యాచరణ, వారి త్యాగాలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా కిషోర్, అల్వాల్ జేఏసి అధ్యక్షులు పటోళ్ళ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, ఢిల్లీ పరమేష్, కరంచంద్, డోలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్‌లో...

ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ప్రొ. జయశంకర్ వర్ధంతి వేడుకలు శుక్రవారం గౌతంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్‌లు జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా మల్కాజిగిరిలో జేఏసీ వెంకన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి మర్రి రాజశేఖర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్పొరేటర్ సునీతాయాదవ్, ఉద్యమకారులు ఉపేంద్ర, సతీష్, ఖలీల్,కాటం రాజు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలు ధిక్కరించినందుకే చర్యలు

కుషాయిగూడ: అడ్రిన్ సొసైటీ ఇళ్ల స్థలాల విషయంలో కోర్టు ఆదేశాలను ధిక్కరించారంటూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ పోటూరు, కాప్రా తహసీల్దార్ సుచరిత, కాప్రా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డికి కోర్టు నోటీసులు జారీ చేసినట్లు సొసైటీ ప్రతినిధుల తరఫున జిపిఎ చేసుకున్న కాజా అనిల్, మేకల నవీన్ శుక్రవారం విలేఖరులకు తెలిపారు. కాప్రా మండలం ఆదర్శ నగర్‌లోని సర్వే నెంబరు 152లోని 13 ఎకరాలకు సంబంధించి యజమాన్య హక్కులు ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు కస్టోడియల్ స్థలాలంటు బోర్డు పెట్టారన్నారు. దీనిపై అడ్రిన్ సొసైటీ ప్రతినిధులు 2022లో హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. విచారణ జరిపిన న్యాయస్థానం సదరు స్థలం పట్టా భూమి అని ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, యథాస్థితిని కొనసాగించాలంటు తీర్పునిచ్చిందని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పునిచ్చినప్పటికి రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సదరు భూమిలో నాలా, బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టడం, చెత్త డంపు చేయడం వంటి కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీంతో జిపిఎ హోల్డర్స్ కాజా అనిల్, మేకల నవీన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం కలెక్టర్, తహసీల్దార్, డీసీలపై చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలంటు నోటీసులు జారీ చేస్తు తీర్పునిచ్చినట్లు వారు పేర్కొన్నారు.